నమస్తే తెలంగాణ

# రాజన్న సిరిసిల్ల

5 కరీంనగర్, శుక్రవారం 31 జనవరి 2025 RAJANNA SIRCILLA



మంథనిలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న పుట్ట మధూకర్

## నమ్మించి వంచించిన ప్రభుత్వం

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ధ్వజం

మంథని, జనవరి 30 : కాంగ్రెస్ 420 హామీల పేరిట ప్రజలను నమ్మించి వంచనకు గురి చేసిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చి 420 రోజులు గడుస్తున్నా హామీలను అమలు చేయడం లేదని మండిపడ్డారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఎలాంటి ఆత్మహత్యలూ జరగలేదని, ఇప్పుడు పద్నాలుగు నెలల పాలనలో ఆత్మహత్యలు జరగడం బాధాకరమన్నారు. నాడు ప్రభుత్వం అంటే ఒక నమ్మకం, సీఎం అంటే ఒక గౌరవం ఉండేదని గుర్తు చేశారు. కానీ, నేడు సీఎం మాట్లాడినా.. హామీలు ఇచ్చినా ప్రజలు నువ్వుకుంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అలాంటి స్థితిని తీసుకొచ్చిందని ఎద్దేవా చేశారు. తాను అధికారంలో ఉన్నా.. లేకున్నా ప్రజల కోసమే నిరంతరం పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం మంథనిలోని మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో దొంగ హామీలను ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. మోస పూరిత హామీలను నమ్మి ప్రజలు మోసపోయారని, పద్నాలుగు నెలల పాలనలో 410మంది రైతులు, 100 మంది ఆటో డ్రైవర్లు, 35మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని, 55 మంది గురుకుల విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన చెందారు. గతేడాది డిసెంబర్ 28న రైతులకు రైతు భరోసా వేస్తామని సీఎం ప్రకటించారని, అదే విధంగా జనవరి 26న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరిట రైతు కూలీలకు ₹12 వేలు అందిస్తామని చెప్పి మళ్లీ మోసం చేశారని మండిపడ్డారు. ప్రజలకు ఉపయోగపడేలా మ్యానిఫెస్టోను తయారు చేశానని గొప్పలు చెప్పిన మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సంక్షేమ పథకాలు అమలు కాకపోవడంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అక్కడో.. ఇక్కడో పది మందికి పథకాలు అందించి ప్రభుత్వం డబ్బా కొట్టుకుంటుందన్నారు. గాంధీజీ పేరును వాడుకుంటూ ప్రజలను ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్‌కు బుద్ధి వచ్చేలా చేయాలని మహాత్మాగాంధీని వేడుకున్నానని చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, ఆరెపల్లి కుమార్, మంథని లక్ష్మణ్, ఎరుకల రవి, పెగడ శ్రీనివాస్, ఆకుల రాజబాబు, పుప్పాల తిరుపతి, కాయితీ సమ్మయ్య పాల్గొన్నారు.



సుల్తానాబాద్ : గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న సివిల్ సప్లయీస్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ నాయకులు



గోదావరిఖనిలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న చందర్

## అబద్ధాలతో కాలయాపన

- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, జనవరి 29: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ అబద్ధాలతో కాలయాపన చేస్తున్నదని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ విమర్శించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రకరకాల సాకులతో కాలం వెళ్లదీస్తున్నదని, పథకాలకు లేని కొర్రీలు పెట్టి ప్రజలను ఇబ్బంది పెడుతున్నదని మండిపడ్డారు. గురువారం గోదావరిఖని ప్రధానచౌరస్తాలో మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఆరు గ్యారెంటీలు అమలు చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలని మహాత్ముడిని వేడుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చి 420 రోజులు గడిచినా 420 హామీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. సీఎం నుంచి డిప్యూటీ సీఎం వరకు నాయకులందరూ అబద్ధాలతో ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు మూల విజయారెడ్డి, మాజీ కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, గాధం విజయ, కల్వచెర్ల కృష్ణవేణి, బాదె అంజలి, శివకుమార్, నాయకులు నారాయణదాసు మారుతి, బొడ్డు రవీందర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, రాకం వేణు, అచ్చవేణు, తోటవేణు, సట్టు శ్రీనివాస్, బొబ్బిలి సతీశ్, తోకల రమేశ్, ఇరుగురాళ్ల శ్రావణ్, జిమ్మిబాబు, అడప శ్రీనివాస్, వెంకన్న, కోడి రామకృష్ణ, ముద్దసాని సంధ్యారెడ్డి, వెంకటస్వామి, కిరణ్, శంకర్, చింటు పాల్గొన్నారు.

# 420 హామీల పేరిట కాంగ్రెస్ మోసం

**హామీల అమలు కోసం బీఆర్ఎస్ దళం** మరోసారి పోరుబాట పట్టింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 420 రోజులు అవుతున్నా ఇచ్చిన 420 హామీలు అమలు చేయడం లేదని నిలదీసింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో గురువారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాయకులు నిరసనలు తెలిపారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో ఆయన విగ్రహాలకు వినతి పత్రాలు అందించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ 420 హామీల పేరిట ప్రజలను మోసం చేసిందని, అధికారంలోకి వచ్చి 420 రోజులు గడిచినా అమలు చేయకుండా వచించిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదని మండిపడ్డారు. ప్రజలను నమ్మించి దగా చేసిన ఈ అసమర్థ ప్రభుత్వం కళ్లు తెరిపించాలని, హామీలు నెరవేర్చేలా బుద్ధిని ప్రసాదించాలని మహాత్మాగాంధీని వేడుకున్నారు. కాంగ్రెస్ ప్రధానంగా రైతులు మోసం చేసిందని, రుణమాఫీ, రైతుభరోసా అందించడంలో పూర్తిగా విఫలమైందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు ప్రజల పక్షాన నిలిచి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం మెడలు వంచి హామీలు అమలు చేసేలా చేస్తామని స్పష్టం చేశారు.

- రాజన్న సిరిసిల్ల, జనవరి 30 (నమస్తే తెలంగాణ)

## మహాత్మా.. ఈ అసమర్థ ప్రభుత్వం కళ్లు తెరిపించు

- సర్కారుపై బీఆర్ఎస్ ఆగ్రహ జ్వాల
- హామీల అమలు కోసం కేటీఆర్ పిలుపుతో నిరసనలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గాంధీ విగ్రహాలకు వినతులు
- రేవంత్ సర్కారు వైఫల్యాలపై ఆగ్రహం
- అన్ని వర్గాలకూ వెన్నుపోటు పొడిచిందని ధ్వజం
- హామీలు నెరవేర్చే వరకు పోరాడుతామని హెచ్చరిక




కరీంనగర్: కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను ప్రదర్శించి నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



సిరిసిల్ల రూరల్: తంగళ్లపల్లిలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నేతలు

## అసమర్థ ప్రభుత్వం కళ్లు తెరిపించాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మెట్‌పల్లి, జనవరి 30 : ఎన్నికల్లో 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నదని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ధ్వజమెత్తారు. హామీలు అమలు చేయని అసమర్థ ప్రభుత్వం కళ్లు తెరిపించాలని మహాత్మాగాంధీని వేడుకున్నారు. గురువారం మెట్‌పల్లి పట్టణంలోని సాయికృష్ణ థియేటర్ ఎదుట 63వ జాతీయ రహదారిపై ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 420 రోజులు గడిచినా హామీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రుణమాఫీ కాని రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని, ఎకరానికి ఏడాదికి ₹15 వేలు రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఆయన తన నివాసం నుంచి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి జాతీయ రహదారి మీదుగా పాదయాత్రగా మహాత్మాగాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దారిశెట్టి రాజేశ్, మారు సాయిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎలాల దశరథరెడ్డి, జేడీ సుమన్, ఆకుల రాజారెడ్డి, నోముల గంగాధర్, లక్ష్మారెడ్డి, రాజేందర్, ఆకుల ప్రవీణ్, తోట శ్రీనివాస్, మెడిచెల్మెల నాని, లంక గంగాధర్, అంబల్ల కిషన్, జగన్‌రావు, వెంకటేశ్, సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, పీసు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

## దద్దమ్మ పార్టీకి దారి చూపించు

జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, జనవరి 30 : హామీలు అమలు చేయలేని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇప్పటికైనా మంచి బుద్ధి ప్రసాదించాలని మహాత్మాగాంధీని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత వేడుకున్నారు. ప్రజలను మోసం చేసిన ఈ దద్దమ్మ పార్టీకి దారి చూపించాలన్నారు. జగిత్యాలలోని మంచినీళ్ల బావి చౌరస్తా వద్ద గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం దావ వసంత మాట్లాడారు. మోసపూరిత వాగ్దానాలతో సీఎం అయిన రేవంత్ రెడ్డి నిత్యం ప్రజలను వంచిస్తూనే ఉన్నారని, ఆరు గ్యారెంటీలు, 420 హామీలకు పాతరేసి డైవర్షన్ రాజకీయాలతో కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. దేశానికే వెన్నెముక అయిన రైతుకు వరుస వెన్నుపోట్లు పొడుస్తున్నారన్నారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అన్ని వర్గాలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. 410 మంది కిపైగా రైతుల ఆత్మహత్యలకు కారణమైందని విమర్శించారు. నేతన్నలకు ఇచ్చిన హామీలను కూడా తుంగలో తొక్కిందన్నారు. మహిళలకు ప్రతినెలా ₹2500 ఇస్తామని, కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం అందిస్తామని మోసం చేయడంతో ఆడబిడ్డలు రగిలిపోతున్నారన్నారు. వృద్ధులు, వితంతువుల పింఛన్లు ₹4 వేలకు పెంచుతామని నమ్మబలికి ఏడాదైనా ఉలుకుపలుకు లేదన్నారు. యువతకు 2 లక్షల ఉద్యోగాల హామీని, జాబ్ క్యాలెండర్ వాగ్దానాన్ని మొత్తంగా ముఖ్యమంత్రి గంగలో కలిపేశారన్నారు. చివరికి బీఆర్ఎస్ ప్రభుత్వం నింపిన ఉద్యోగాలను తన జేబులో వేసుకునే నీచ రాజకీయాలకు తెరతీశారు. ఈ కాంగ్రెస్ సర్కారు మోసాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ శీలం ప్రియాంక, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనందరావు, పట్టణ ఉపాధ్యక్షుడు వొళ్లం మల్లేశ్, అర్బన్ రూరల్ మండల అధ్యక్షుడు తుమ్మ గంగాధర్, ఆనంద రావు, నాయకులు గంగారెడ్డి, వెంకటేశ్వర్లు, నక్క గంగాధర్, నాడెం శంకర్, రిజ్వాన్, దేవేందర్ నాయక్, బుర్ర ప్రవీణ్ గౌడ్, రాజన్న, మండల మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, బక్కషెట్టి లక్ష్మి, యూత్ నాయకులు పాల్గొన్నారు.



జగిత్యాలలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు



హర్డిల్స్ జంప్‌లో పాల్గొన్న క్రీడాకారులు

## హోరాహోరీగా పోలీస్ క్రీడలు

కొత్తపల్లి, జనవరి 30 : కరీంనగర్‌లోని పరేడ్ మైదానంలో ఈనెల 28 నుంచి ప్రారంభమైన 3వ తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీలు మూడో రోజు హోరాహోరీగా సాగాయి. గురువారం బాక్సింగ్, కరాటే, క్రాస్‌కంట్రీ, టేబుల్ టెన్నిస్, ఇండియన్ మేడ్ సైకిల్ రోడ్ రేస్ విత్ అవుట్, విత్ గేర్, ఆర్చరీ, స్విమ్మింగ్, యోగ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పలు జోన్‌లకు చెందిన క్రీడాకారులు 31 బంగారు , 28 వెండి , 33 కాంస్య పతకాలను గెలుచుకున్నారు. విజేతలకు ముఖ్య అతిథిగా హాజరైన మల్టీజోన్ –1 ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి, బజాజ్ ఎలక్ట్రానిక్స్ కేటగిరీ హెడ్ ఎండీ రమీజ్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. మానేరు దిగువ జలాశయంలో నిర్వహించిన వాటర్ స్పోర్ట్స్ విభాగంలోని కేనోయింగ్, కయాకింగ్ క్రీడలను ఐజీపీ స్పోర్ట్స్ రమేశ్‌రెడ్డి, కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి తిలకించారు. ఫిబ్రవరి 1న పోటీలు ముగియనున్నాయి.



బాడీ బిల్డింగ్ పోటీల విజేతకు పతాకం బహూకరిస్తున్న సీపీ

# భగ్గుమన్న పత్తి రైతు

- పెద్దపల్లి మార్కెట్‌లో రెండు రోజల వ్యవధిలో ₹2 వేలు తగ్గింపు
- ఆగ్రహించిన రైతులు..
- ధర పెంచాలని పెద్దపల్లిలో ధర్నా
- ఖరీదుదారులు కుమ్మక్కై రేటు తగ్గించారని ఆరోపణ



పెద్దపల్లి జిల్లా కేంద్రంలో రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

పెద్దపల్లి, జనవరి 30: పత్తి రైతులు భగ్గుమంటున్నారు. పెద్దపల్లి మార్కెట్‌లో రెండు రోజుల వ్యవధిలో ఒకేసారి ₹రెండు వేలు తగ్గించడం మండిపడుతున్నారు. సోమవారం క్వింటాల్ పత్తి ₹7 వేలు పలికిందని, గురువారం ₹5 వేలకు పడిపోయిందని ఆగ్రహిస్తూ జిల్లాకేంద్రంలో రోడ్డెక్కారు. రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేశారు. గురువారం దాదాపు 2వేల వేల క్వింటాళ్ల పత్తి వచ్చిందని, ఇదే అదునుగా భావించి ఖరుదుదారులు కుమ్మక్కై పత్తి ధర తగ్గించారని ఆరోపించారు. క్వింటాల్‌కు ₹7 వేలు చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. విషయం తెలుసుకొని పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ లక్ష్మణ్‌రావు పోలీస్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, ఖరీదుదారులు, అధికారులు, నాలుగురైదుగురు రైతులతో చర్చలు జరిపారు. రేటు పెంచే దాకా తూకం వేయవద్దని ఈ సందర్భంగా రైతులు సూచించారు. చర్చ సాగుతుండగానే ఓ అడ్తిలో పత్తి తూకం వేస్తుండడంతో రైతులు మూకుమ్మడిగా వెళ్లి కాంటాను ధ్వంసం చేశారు. చర్చల అనంతరం క్వింటాలుకు ₹50 పెంచేందుకు ఖరీదుదారులు ఒప్పుకొన్నట్టు చైర్ పర్సన్ తెలుపడంతో ఆమెను నిలదీశారు. ₹50 ఇస్తామని చెప్పడం అన్యాయమని, తాము బిచ్చగాళ్లమా? క్వింటాల్‌కు ₹300 చొప్పున పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంలో మరోసారి రోడ్డెక్కేందుకు వెళ్తుండగా పోలీస్ సిబ్బంది అడ్డుకొని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. క్వింటాల్‌కు ₹వంద చొప్పున చెల్లించాలని రైతులు కోరగా, మరోసారి చర్చించుకొని ₹6500 కంటే ధర తక్కు పడ్డ రైతులకు మాత్రమే ₹వంద చెల్లిస్తామని చైర్‌పర్సన్ చెప్పారు. దీంతో రైతులు సందిగ్ధంలో పడ్డారు. దీంతో కొంత మంది మాత్రమే పత్తిని విక్రయించారు. మిగతా రైతులు వెళ్లిపోయారు.



పత్తితో నిరసన తెలుపుతున్న రైతులు



అధికారులను నిలదీస్తున్న రైతులు

## కోడ్ విధిగా పాటించాల్సిందే

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 30 : శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థులు, వారికి మద్దతు ఇచ్చే పార్టీలు ఎన్నికల కోడ్‌ను విధిగా పాటించాల్సిందేనని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి స్పష్టం చేశారు. ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, తదితర అంశాలపై గురువారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నిర్వహించే ర్యాలీలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తేల్చి చెప్పారు. ప్రజలను ప్రభావితం చేసేలా ఉన్న ఫ్లెక్సీలు, బ్యానర్లు, గోడలపై రాతలు, చిత్రపటాలు తొలగించినట్లు వెల్లడించారు. అభ్యర్థులు, ఇతరులు ఎవరైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు చేయాలనుకుంటే అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించే ఆర్డీవోలకు అందజేయాలని సూచించారు. ఇప్పటికే జిల్లాలోని బెల్ట్ షాపులను మూసివేసినట్టు తెలిపారు. వాహనాల వినియోగానికి ఏఆర్వోల అనుమతి తప్పనిసరి అని తెలిపారు. పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు వివరాలను నమోదు చేయనున్నట్లు చెప్పారు. మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్– కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి 15 జిల్లాలు, 35 డివిజన్లు, 271 మండలాలు ఉన్నాయని తెలిపారు. 499 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. డివిజన్లలో ఆర్డీవోలు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి 274 పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనుట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.